## కోనేటిరాత్రి

ప్రగతి కోనేటిరావు పేరు. స్థూలకాయుడు. జీవిత మధ్యాహ్నం గడిచిపోయినవాడు. హెడ్డు గుమాస్తా. బండెడు కుటుంబం. జటావల్లభుల కోనేటిరావు పంతులు పేరు పేపర్లో కనబడదు. రేడియోలో వినబడదు. అతని పగళ్ళన్నిటికీ ఆకారం ఒక్కటే.

రాత్రి నిద్రపోతూన్న కోనేటికళ్ళ వెనుకనుంచి అతని అపస్మార మనస్సులోని స్వప్న విన్యాసాలు చూదాం రండి.

"సినిమా ప్రపంచానికొక కొత్తవెలుగు. కథానాయకుని నటనానైపుణ్యం అమోఘం, అద్వితీయం, అవాఙ్మానస గోచరం! ఆజానుబాహువు. సౌందర్యాపర మత్స్య లాంఛనుడు. మన కోనేటిరావు కథానాయికను దుర్గమారణ్యాలనుండి సింహ శరభ శార్దూల గవయగండకాది భయంకర జంతుజాలంనుంచి తప్పించి సురక్షిత స్థానం చేర్చాడు. నాయిక కృతజ్ఞత జాలువారే కళ్ళతో చూస్తోంది. ఆమె కళ్ళలోనికి తానుకూడా అనురాగంగా చూస్తూ—పాట! సంగీతం. సినీమా సంగీతం. జంత్ర గాత్రముల రాల్గరగించు విమల గాంధర్వం అందుకున్నాడు కోనేటిరావు."

చేతిపిల్లడు జడుసుకుని కెవ్వుమని ఏడిస్తే నిద్రాభంగమయింది కోనేటిరావుకి.

*　　　　*　　　　*

"ద్వితీయప్రపంచ మహాసంగ్రామం అల్లకల్లోలంగా సాగిపోతోంది. సముద్ర భూమ్యాకాశాలు యుద్ధ సంరంభంతో ఘూర్ణిల్లిపోతున్నాయి. అట్లాంటిక్ మహా సముద్రాన్ని చీల్చుకుంటూ వస్తూన్న ముప్ఫయి అయిదువేల టన్నుల బ్రిటిష్ యుద్ధనౌకను చూశాడు జర్మన్ సబ్మెరిన్ కమాండర్ జటావల్ కోనేట్. వెంటనే దాన్ని టార్పీడో చెయ్యమని తన పరివారాని కుత్తరువిచ్చాడు: వెల్టాన్ షౌంగ్ డెర్ అంటర్ డెన్ లిండెన్! గెస్టాల్ డెర్ డాయిష్లాండ్ ఊబర్ అల్స్! మంచినీళ్ళ ప్రాయంగా జర్మన్ భాష మాట్లాడేస్తున్నాడు. తునాతునియలయిపోయింది యుద్ధనౌక. అందులోని నావికులు చిన్నచిన్న పడవలలో ప్రాణాలు రక్షించకొనబోతూఉంటే వాళ్ళమీద మెషీన్ గన్లు పేల్చమని ఆర్డరువేశాడు కమాండర్ కోనేట్. ఫోల్క్ షేర్ బియో బాక్టర్!

గెహెన్నా! ఆఖ్‌టంగ్! జైట్ గైస్ట్! మైన్ కాంఫ్."

పిల్లి పాలగిన్నె పడదోసిన చప్పుడు. కోనేటిరావుకి మెలకువ వచ్చింది.

*　　　　*　　　　*

గంగానదిమొదలు కావేరీనదివరకు భారతదేశంలోని అన్ని నదులనూ కలిపి ఆనకట్టలు కట్టిన అసాధారణ ఇంజనీరింగ్ జీనియస్‌కు అమెరికా ప్రభుత్వం స్వాగతం ఇస్తోంది. మా పెన్సిల్వేనియా పన్నీశలోయ తమరు పరిశీలించాలి. అమూల్యమైన మీ సలహాలు శిరసావహిస్తాము. సిఫారసులు తక్షణమే అమలుచేస్తాము ..........అబ్బే! అదెంత మాట! అల్పజ్ఞుణ్ణి నన్నేదో పెద్దవాణ్ణిచేసి పొగుడుతున్నారు. నామాత్రం తెలివైనవాళ్లు మీ అమెరికాలో లేకపోయారా? అంతదూరంనించి ప్రత్యేకం నన్నిక్కడకు ఆహ్వానించడం మీ ఔదార్యాన్నే చాటుతోంది. అయినా ఈ సన్మానం నాదికాదు. ఆంధ్రదేశానిదీ గౌరవం. జై, ఆంధ్రమాతాకు జై!"

ఇంకో కుర్రాడి యేడుపు.

*　　　　*　　　　*

"మళ్ళీ సత్యాగ్రహోద్యమం ప్రారంభమయింది. ఎన్ని సత్యాగ్రహాలు చేసినా ఈ యింగ్లీషువాడు మనల్ని వదిలిపెట్టేటట్టు లేడు. ఈసారి దీని అంతు చూడవలసిందే. కేవలం అహింసనే పాటిస్తూ కూచోకూడదు. మహారాజశ్రీ జటావల్లభుల కోనేటిరావు పంతులు ఆఫీసు బీరువాలు విరక్కొట్టేస్తున్నాడు. కుర్చీలూ, బల్లలూ గుండపిండి చేసేస్తున్నాడు. కాగితాలు తగలబెట్టేస్తున్నాడు. సిరాబుడ్లు గోడలకివేసి కొట్టేస్తున్నాడు. కలాలు విసిరిపారేస్తున్నాడు. ఎదురుగుండా దొరగారు వస్తే గూబగింయిమనేటట్టు వాడికొక లెంపకాయ యిచ్చుకున్నాడు. ఒక పెద్ద పేపర్ వెయిటు తీసి ఆఫీసు గోడగడియారాన్ని చూసి విసిరాడు."

తెల్లారిపోయింది నాన్నా!

కోనేటి నిద్ర కొండెక్కిపోయింది. *